సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం । 1 । డిసెంబర్ । 2024



జీరో దందాకు చెక్!
ఇల్లెందు మార్కెట్ పరిధిలో కొందరు వ్యాపారులు జీరో వ్యాపారం చేస్తుండగా కట్టడికి అధికారులు చర్యలు చేపడుతున్నారు. 8లో



అవగాహనతోనే ఎయిడ్స్ కట్టడి
ఎయిడ్స్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తేనే కట్టడి సాధ్యమవుతుందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
29°/23°

వాతావరణం
జిల్లాలో ఆదివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలు ప్రాంతాల్లో చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఫొటోగ్రాఫర్‌కు జాతీయ స్థాయి అవార్డు

భద్రాచలంటౌన్: భద్రాచలానికి చెందిన ప్రముఖ ఫొటోగ్రాఫర్ ఎస్‌కే షరీఫ్ జాతీయ స్థాయి అవార్డు గెలుచుకున్నారు. విజయవాడలోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఇండియా ఇంటర్‌నేషనల్ ఫొటోగ్రఫిక్ కౌన్సిల్, ఇండియన్ ఫొటోగ్రఫీ అకాడమీ నిర్వహించిన ఫొటో కాంటెస్ట్‌లో షరీఫ్‌కు బ్యూటీ ఆఫ్ నేచర్ విభాగంలో అవార్డు లభించింది. శనివారం విజయవాడలో జరిగిన ఫొటోగ్రఫీ డే ఉత్సవాల్లో ఏపీ ఉన్నత విద్యాశాఖ కౌన్సిల్ చైర్మన్ కె.రామ్మోహనరావు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా షరీఫ్‌ను పట్టణానికి చెందిన పలువురు అభినందించారు.

లక్ష్మీనగరం పాఠశాలకు గుర్తింపు

దుమ్ముగూడెం : మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలో గల సీఎస్‌ఐ ప్రాథమిక పాఠశాలను ప్రభుత్వ మండల పరిషత్ పాఠశాలగా గుర్తిస్తూ డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు స్థానిక ఎంఈఓ సున్నం సమ్మయ్యకు ఉత్తర్వు ప్రతులను అందజేశారు. 70 ఏళ్ల చరిత్ర గల ఈ పాఠశాలను కొంతకాలంగా సీఎస్‌ఐ యాజమాన్యం పట్టించుకోకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. ఈ విషయాన్ని గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆదేశాలతో డీఈఓ డిప్యూటేషన్‌పై ఉపాధ్యాయురాలిని ఏర్పాటు చేసి పాఠశాల నిర్వహణకు చర్యలు తీసుకున్నారు. తాజాగా ప్రభుత్వ మండల పరిషత్ పాఠశాలగా మార్చడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జూనియర్ ఫారెస్ట్ అసిస్టెంట్ పోస్టులకు నేడు రాత పరీక్ష

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో ఖాళీగా ఉన్న 12 జూనియర్ ఫారెస్ట్ అసిస్టెంట్ (ఇంటర్నల్) పోస్టులకు స్థానిక సింగరేణి మహిళా డిగ్రీ కళాశాలలో ఆదివారం రాత పరీక్ష నిర్వహించనున్నారు. ఈ పోస్టుల భర్తీకి గత మార్చిలో నోటిఫికేసన్ విడుదల చేయగా, 11 ఏరియాల్లోని 541 మందికి హాల్‌టికెట్లు పంపిణీ చేశారు. ఆదివారం పరీక్ష నిర్వహించి, ఫలితాలు ఆ రాత్రికే సింగరేణి వెబ్‌సైట్‌తో పాటు సంస్థ ప్రధాన కార్యాలయ నోటీస్ బోర్డ్‌లో పెడతామని అధికారులు వెల్లడించారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

పాల్వంచ: పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక ఆశ్రమ పాఠశాలలో శనివారం నిర్వహించిన మండల మహాసభలో వారు మాట్లాడారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం రద్దు చేసి పాత పెన్షన్ స్కీం కొనసాగించాలని, జిల్లాలో కొనసాగుతున్న అక్రమ డిప్యూటేషన్లను రద్దు చేయాలని, ఎంతో కాలంగా ట్రెజరీల్లో పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆకుల విజయ భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా ఎస్‌కే.యాకూబ్ పాషా, ఉపాధ్యక్షులుగా టి.వెంకన్న, పి.సత్యశ్రీ, కోశాధికారిగా ఎ.నరసింహారావు, కార్యదర్శులుగా జి.హరిసింగ్, ఎం.రాజు, వి.సోమ్లా, బి.శ్రీను, మట్టూరి శ్రీనివాసరావు, కవిత, విజయలక్ష్మి, వి.వెంకటేశ్వర్లు, బి.బాల్య, బాలు, అంబికా జాదవ్, కోటేశ్వరరావు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నాయకులు పి.రాంబాబు, సువర్చల, పద్మజ, సురేష్‌బాబు, యాదగిరి, నాగమణి, ఇంద్రసేనా రెడ్డి, రాము, సుధారాణి, రమాదేవి, శ్రీనివాస్, హాతిరామ్, వీరు, థామస్, బాలు నాయక్ పాల్గొన్నారు.

జిల్లాలో విమానాశ్రయం నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చకచకా అడుగులు వేస్తోంది. త్వరలోనే ప్రీ ఫీజిబిలిటీ సర్వే కోసం కేంద్ర బృందాలు జిల్లాకు రానున్నాయి. దట్టమైన అడవులు, సహజ సంపదతో కూడిన ఈ జిల్లాకు ఒకప్పుడు జలమార్గమే ప్రధానం. సింగరేణి బొగ్గు గనులతో పారిశ్రామికీకరణ మొదలైన తర్వాత నెమ్మదిగా రోడ్డు, రైలు మార్గాలు వచ్చాయి. గోదావరిపై వంతెన నిర్మాణంతో అంతకు ముందున్న జలరవాణా సదుపాయాలు క్రమంగా కనుమరుగయ్యాయి.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం



దుమ్ముగూడెం దగ్గర జల రవాణా కోసం కాటన్ నిర్మించిన ప్రత్యేక కాలువ (ఇన్‌సెట్) ప్రాభవం కోల్పోయిన రేవు ప్రాంతానికి వెళ్లే రహదారి



ఒకప్పుడు జల విహారం.. త్వరలో విమానయానం

బ్రిటీష్ హయాంలో గోదావరిలో జల రవాణా
- పడవల్లోనే అటవీ ఉత్పత్తుల రవాణా
- రాజమండ్రి నుంచి వెంకటాపురం వరకు పడవలు
- గొమ్ముూరు నుంచి భద్రాచలానికి ఎడ్లబండ్లు

అటవీ సంపద రవాణా కోసం..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటుకు ముందు భద్రాచలం పట్టణం తూర్పుగోదావరి జిల్లాలో భాగంగా ఉండేది. దండకారణ్యం కావడంతో ఆ జిల్లాకు చెందిన రాజమండ్రికి రాకపోకలు కష్టంగా ఉండేవి. కాలినడక, ఎడ్లబండ్ల ద్వారా వచ్చేందుకు వీలులేనంతగా రంపచోడవరం అడవులు విస్తరించి ఉండేవి. దీంతో ప్రజలు ప్రధాన రవాణా సాధనంగా పడవలను ఉపయోగించేవారు. రాజమండ్రి – దేవీపట్నం – కూనవరం – భద్రాచలం – దుమ్ముగూడెం – వెంకటాపురం(ఎస్) వరకు పడవలు నడిచేవి. ఈ పడవ మార్గంలోనే వచ్చిన సర్ ఆర్థర్ కాటన్ దుమ్ముగూడెం వద్ద బ్యారేజ్ నిర్మించాడు. దీంతో జల రవాణాకు ఇబ్బంది రాకుండా నదికి ఎడమ వైపున పడవలు తిరిగేందుకు వీలుగా కెనాల్ నిర్మాణం చేపట్టారు. ఈ కెనాల్ ద్వారా సిరొంచ (మహారాష్ట్ర), వాజేడు, వెంకటాపురం, చర్ల ఏజెన్సీకి సంబంధించిన అటవీ ఉత్పత్తులను దుమ్ముగూడెం మీదుగా భద్రాచలం, రాజమండ్రి తరలించేవారు.

పడవ ప్రయాణానికి గుర్తు బొబ్బల నరసింహుడు..

రాజమండ్రి నుంచి భద్రాచలం సీతారాముల దర్శనానికి వచ్చే భక్తులు పడవలో పాపికొండల గుండా ప్రయాణం చేసేవారు. అయితే పాపికొండల నడుమ ప్రయాణించేప్పుడు నీటి అడుగు భాగం నుంచి 'బ్బొ.. బ్బొ..' అంటూ పెద్ద శబ్దం వినిపించేది. భయపడిన భక్తులు 'శాంతించు గోదావరి' అంటూ పసుపు, కుంకుమ నీళ్లలో చల్లేవారు. నీరు బాగా తగ్గినప్పుడు ఈ ప్రాంతంలో గజ ఈతగాళ్లతో వెదికితే నరసింహుడి విగ్రహం బయటపడింది. ఈ విగ్రహాన్ని భద్రాచలం తెచ్చి ఆలయానికి ఎదురుగా తూర్పు వైపున ఉన్న కొండపై ప్రతిష్ఠించి బొబ్బల నరసింహుడిగా కొలుస్తున్నారు.

భద్రాచలంలో రేవు..

రాజమండ్రి, దుమ్ముగూడెం వైపు నుంచి భద్రాచలం వచ్చే లాంచీలు, పడవలు ప్రస్తుతం ఉన్న పాత వంతెన దిగువ భాగంలో ఉన్న ఎత్తయిన రాతి గుట్టల వద్ద లంగరు వేసేవి. మరోవైపు కొత్తగూడెం, పాల్వంచ నుంచి వచ్చే వారు గొమ్మూరు దగ్గర తమ వాహనాలు దిగి గోదావరి తీరానికి చేరుకునేవారు. అక్కడి నుంచి నదిలో నీటి ప్రవాహం ఉండే వరకు ఇసుకలో భక్తులను తీసుకెళ్లేందుకు వీలుగా ఎడ్లబండ్లు అందుబాటులో ఉండేవి. ఈ బండ్లను నడిపే కుటుంబాలు ఇప్పటికీ గొమ్మూరు, రెడ్డిపాలెం గ్రామాల్లో ఉన్నాయి. అయితే భక్తులతో వెళ్తున్న పడవ మునిగిపోవడంతో 50 ఏళ్ల క్రితం భద్రాచలం వద్ద వంతెన నిర్మాణం చేపట్టారు. దీంతో పడవలు, ఎడ్ల బండ్ల సర్వీసులు నిలిచిపోయాయి. ఒకప్పుడు పడవలు లంగరు వేసిన ప్రాంతం ఇప్పుడు శ్మశానంగా మారింది.

పోను ఐదు, రాను రెండు గంటలు..

గోదావరిలో తిరిగే పడవలు దుమ్ముగూడెం దగ్గర జల రవాణా కోసం ప్రత్యేకంగా నిర్మించిన కెనాల్‌లోకి చేరేవి. ఈ కెనాల్ సమీపంలో ఏర్పాటు చేసిన రేవు దగ్గర పడవల్లో వచ్చిన సరుకులు, ప్రయాణికులను దించేవారు. దుమ్ముగూడెంలో మొదలైన పడవ ప్రయాణం ముందుగా ఆవతలి ఒడ్డున ఉన్న అమ్మగారిపల్లెకు చేరుకునేది. అక్కడ ప్రయాణికులను ఎక్కించుకుని వెంకటాపురం వైపునకు వెళ్లేది. ప్రవాహానికి ఎదురెళ్లడం వల్ల వెంకటాపురం చేరేందుకు ఐదు గంటల సమయం పట్టేది. తిరుగు ప్రయాణంలో కేవలం రెండుగంటల్లోనే వెంకటాపురం నుంచి దుమ్ముగూడెం వరకు పడవలు చేరుకునేవి. రోడ్డు మార్గం వచ్చిన తర్వాత దుమ్ముగూడెం ఆనాటి కళ కోల్పోయింది. ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య సముదాయాలు లక్ష్మీనగరం వద్దకు చేరాయి. దుమ్ముగూడెంలో ఉన్న ఆనాటి భవనాలు, రేవు ప్రాంతాలు క్రమంగా శిథిలావస్థకు చేరుతున్నాయి.



దుమ్ముగూడెంలో శిథిలావస్థకు చేరిన ఒకప్పటి ఐబీ గెస్ట్‌హౌస్

రామయ్యకు వైభవంగా సువర్ణ తులసీ అర్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారికి శనివారం సువర్ణ తులసీ అర్చన వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రామయ్య సేవలో అడిషనల్ డీజీపీ



రామాలయంలో కుటుంబసభ్యులతో శ్రీనివాసరావు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారిని అడిషనల్ డీజీపీ వి.వి.శ్రీనివాసరావు శనివారం కుటుంబ సమేతంగా దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఘనంగా స్వాగతం పలికిన ఆలయ అర్చకులు ఆయనకు దేవస్థానం ప్రాచుర్యాన్ని వివరించారు. ఆ తర్వాత స్వామివారి జ్ఞాపికతో పాటు ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో సీఐ సంజీవరావు, ఎస్‌ఐలు పీవీ రావు, విజయలక్ష్మి, ఆలయ సిబ్బంది సాయిబాబు పాల్గొన్నారు.

నేడు 2 కే రన్

కొత్తగూడెంఅర్బన్: ప్రజాపాలన, ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం 6.30 గంటలకు స్థానిక ఇల్లెందు క్రాస్ రోడ్డు నుంచి రామచంద్రా డిగ్రీ కాలేజీ వరకు 2కే రన్ నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి పరంధామ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్ రాజు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు.

'ఉర్సే షరీఫ్' వేడుకలు ప్రారంభం

నాగుల్‌మీరా దర్గాలో సందల్ సమర్పణ



హజరత్ ఖాసీం దుల్హా దర్గా షరీఫ్‌లో పూజ చేస్తున్న భక్తులు



సందల్ తీసుకెళ్లేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనం

ఇల్లెందురూరల్: కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు భక్తిశ్రద్ధలతో ఆరాధించే హజరత్ నాగుల్‌మీరా మౌలా చాన్ దర్గాహ్ 22వ ఉర్సు ఉత్సవాలు శనివారం ఘనంగా మొదలయ్యాయి. ప్రారంభ సూచికగా పట్టణంలోని హజరత్ ఖాసీం దుల్హా దర్గా షరీఫ్‌లో ఖాసీం దుల్హాకు తెల్లటి దుస్తులు ధరించిన భక్తులు పూలమాల వేసి ప్రత్యేక పూజలు చేశారు. దర్గా ప్రాంగణంలో ఉత్సవాలు ప్రారంభిస్తున్నట్లు ప్రకటిస్తూ బాణాసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. అనంతరం ప్రత్యేక వాహనంలో సందల్‌ను ఉంచి ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న సత్యనారయణపురంలోని హజరత్ నాగుల్‌మీరా మౌలా చాన్ దర్గాహ్‌కు చేరుకున్నారు. దర్గా మాలిక్ లక్ష్మీనారాయణ, భక్తులు సందల్‌కు ఘనంగా స్వాగతం పలికారు. ఆ తర్వాత హజరత్ నాగుల్ మీరా మౌలా చాన్‌కు సమర్పించి ధూపదీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ వేడుకకు నాగుల్ మీరా భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో దర్గాహ్ ప్రాంతం కిక్కిరిసిపోయింది.

అన్నదాతల్లో ఆందోళన

- రైతుల్లో తుపాను గుబులు..
- ముమ్మరంగా వరికోతలు, జోరుగా పత్తితీతలు
- కల్లాల్లోనే ధాన్యం రాశులు
- కలవరపెడుతున్న వర్షపు జల్లులు



బూర్గంపాడు మార్కెట్ ఆవరణలో ధాన్యపు రాశులపై కప్పిన టార్పాలిన్లు

బూర్గంపాడు: ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికందే సమయంలో వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులు రైతులను కలవరపెడుతున్నాయి. శుక్ర, శనివారాల్లో జిల్లా వ్యాప్తంగా దట్టమైన మబ్బులు కమ్మి అక్కడక్కడా జల్లులు కురిశాయి. వాతావరణంలో వచ్చిన మార్పులతో వర్షాకాలాన్ని తలపిస్తోంది. వరి కోతలు, పత్తి తీతలు జోరుగా సాగుతున్న తరుణంలో అకాల వర్షాలు అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. దక్షిణ బంగాళాఖాతంలో ఏర్పడిన తుపానుతో తెలంగాణలోని పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. జిల్లాకు కూడా మూడురోజుల పాటు వర్ష ప్రభావం ఉంటుందని తెలపడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

20 రోజులుగా వరి కోతలు..

జిల్లాలో ఈ ఏడాది సుమారు 1.78 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా.. 20 రోజులుగా పంట కోస్తున్నారు. సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తుండడంతో రైతులు వాటి సాగుకే మొగ్గ చూపారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినా 12 శాతం కంటే తక్కువ తేమ ఉంటేనే తీసుకుంటుండడంతో రైతులు వారం రోజుల పాటు ఆరబెట్టాల్సి వస్తోంది. తుఫాను హెచ్చరికలు, చిన్నపాటి జల్లులు కురుస్తుండటంతో ధాన్యాన్ని కుప్పలు చేసి పట్టాలు, టార్పాలిన్లు కప్పుతున్నారు. కొందరు రైతులు తుపాన్ హెచ్చరికలతో వరి కోతలు వాయిదా వేస్తున్నారు. చిరు జల్లులు కురుస్తుండడంతో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు నిలిపేశారు. ఇక ఇప్పటివరకు వరి కోయని రైతులు.. భారీ వర్షాలు కురిస్తే పంట చేతికందుతుందో లేదోననే ఆందోళనలో ఉన్నారు.

పత్తి రైతులదీ అదే పరిస్థితి..

తుపాను హెచ్చరికలు పత్తి రైతులనూ కలవరపెడుతున్నాయి. జిల్లాలో ఈ ఏడాది సుమారు 2 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో దిగుబడి గణనీయంగా తగ్గుతోంది. ప్రస్తుతం రెండో విడత పత్తి తీసే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. కాగా, శనివారం కురిసిన చిరు జల్లులకు పత్తి తీతలు నిలిచిపోయాయి. తొలివిడత తీసిన పత్తిలో తేమ ఎక్కువగా ఉండడంతో తక్కువ ధరలకే ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకున్నారు. రెండో విడత పత్తినైనా సీసీఐ కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలనుకుంటున్న తరుణంలో తుఫాను హెచ్చరికలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇప్పుడు వర్షాలు కురిస్తే పూసిన పత్తి రంగు మారే ప్రమాదం ఉంది. ఆ పత్తిని సీసీఐ కొనుగోలు చేయదు. దీంతో రైతులు మరింతగా నష్టపోయే అవకాశాలున్నాయి.

జిల్లాపై తుపాను ప్రభావం

చుంచుపల్లి: జిల్లాపై తుపాను ప్రభావం పడింది. దీంతో రెండు రోజులుగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. శనివారం రోజంతా ఆకాశం మేఘావృతమై కనిపించింది. కొత్తగూడెంతో పాటు పలు ప్రాంతాల్లో చిరు జల్లులు కురిశాయి. ఇక తుపాన్ ప్రభావంతో రెండు రోజులుగా చలి తీవ్రత తగ్గింది. గత వారం రోజులుగా జిల్లాపై చలి పంజా విసురుతోంది. పొగ మంచు, చలి గాలులతో ఏజెన్సీ ప్రాంత ప్రజలు ఇబ్బంది పడ్డారు. అయితే తుపాన్ ప్రభావంతో చలి నుంచి ప్రజలకు కొంత ఊరట లభించినట్టయింది. ఈనెల 2 వరకు తుపాన్ ప్రభావం ఉంటుందని సమాచారం. శనివారం మధ్యాహ్నం అక్కడక్కడా చిరుజల్లులు కురవగా కల్లాల్లో ఆరబోసిన ధాన్యాన్ని రక్షించుకునేందుకు రైతులు నానా హైరానా పడ్డారు.

ధరణి దరఖాస్తులు పరిష్కరించాలి

అధికారులకు కలెక్టర్ ఆదేశం

సూపర్‌బజార్(కొత్తగూడెం): ధరణి పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్లు డి.వేణుగోపాల్, విద్యాచందనతో కలిసి శనివారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ధరణి మాడ్యూల్స్‌లో ఉన్న దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్నారు. సమగ్ర సర్వే డేటా ఎంట్రీ వేగవంతం చేయాలని సూచించారు. అవసరమైతే అదనపు కంప్యూటర్లు, అదనపు డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించాలన్నారు. ఇది పూర్తి చేసి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌కు సూచించారు. పీఎం కుసుమ్ పథకం కింద మహిళా సమాఖ్య ద్వారా ఒక మెగావాట్ సోలార్ పవర్ ప్లాంట్ స్థాపనకు జిల్లాలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ఐదు కిలోమీటర్ల పరిధిలో అనువైన ప్రభుత్వ స్థలాన్ని గుర్తించాలన్నారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాలల స్థాపనకు స్థలం గుర్తించాలని కొత్తగూడెం, భద్రాచలం ఆర్డీఓలను ఆదేశించారు.

షాపింగ్ కాంప్లెక్స్‌ను వినియోగంలోకి తేవాలి..

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లు రెండేళ్లుగా నిరుపయోగంగా ఉన్నాయని, తక్షణమే వాటిని వినియోగంలోకి తేవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. శనివారం ఆయన షాపింగ్ కాంప్లెక్స్‌లను పరిశీలించి మాట్లాడారు. ఈ కాంప్లెక్స్‌ల్లో పది రోజుల్లో మహిళా సంఘాలతో ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. పలు రకాల టిఫిన్లు, స్నాక్స్, భోజనంతో పాటు రుచికరమైన ఆహార పదార్థాలను మహిళా సంఘాలు తయారు చేసి ఇక్కడే వ్యాపారం చేసేలా చూస్తామని, కాంప్లెక్స్ చుట్టూ సోలార్ లైటింగ్ ఏర్పాటు చేయాలని అన్నారు.ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ శేషాంజన స్వామి, కౌన్సిలర్ రుక్మాంధర్ బండారి ఉన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

భోజన వర్కర్లు శుభ్రత పాటించాలి

మధ్యాహ్న భోజనం తయారు చేసేవారు పరిశుభ్రత పాటించాలని కలెక్టర్ అన్నారు. జిల్లాలోని భోజన వర్కర్లకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వంట చేసేముందు కాళ్లు చేతులు శుభ్రంగా కడగాలని, తలకు టోపీ ధరించాలని సూచించారు. కూరగాయలతో పాటు మునగ, కరివేపాకు, చింతాకుతో చేసిన వంటలు వడ్డిస్తే పిల్లలకు బలం చేకూరుతుందన్నారు. పుచ్చులు, పురుగులు పట్టిన బియ్యం, కూరగాయలు వండొద్దని, పిల్లలకేదైనా అనర్థం జరిగితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి, విద్యాశాఖ ప్లానింగ్ కోఆర్డినేటర్ సతీష్ కుమార్, శ్రీనివాస్, ఎంఈఓలు ప్రభుదయాళ్, బి.బాలాజీ, పి.కృష్ణయ్య పాల్గొన్నారు.

ఘనంగా రైతు పండుగ

టేకులపల్లి: ప్రజా విజయోత్సవాల్లో భాగంగా మండలంలోని ముత్యాలంపాడు క్రాస్‌రోడ్‌లో గల రైతు వేదికలో శనివారం నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనయ్య హాజరయ్యారు. మహబూబ్‌నగర్‌లో జరిగిన రైతుల పండుగ లైవ్ కార్యక్రమాన్ని రైతులు, అధికారులతో కలిసి వీక్షించారు. డీఏఓ వి.బాబూరావు, ఏడీఏ లాల్‌చంద్, డీఎంఓ నరేందర్, సివిల్ సప్లయ్ డీఎం త్రినాథ్ బాబు, డీఎస్‌ఓ రుక్మిణి, డీటీ ముత్తయ్య, ఎంపీడీఓ రవీంద్రరావు, ఏఓ అన్నపూర్ణ, ఏఈఓలు శ్రావణి, ప్రవీణ్, భాగ్యశ్రీ, రెహానా, టెక్నికల్ ఏఓ సాయి నారాయణ, రామకృష్ణ, నాగయ్య పాల్గొన్నారు.

పూజారుల సమస్యలు కేంద్రం దృష్టికి తీసుకెళ్తా..

చంద్రుగొండ : దేశవ్యాప్తంగా ఉన్న గిరిజన, బహుజన పూజారుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని విశ్వహిందూ మహా సంఘ్ జాతీయ కో ఆర్డినేటర్ శాంతి ముఖేష్‌నాథ్ గురూజీ అన్నారు. మండలంలోని అయన్నపాలెంలో శనివారం జరిగిన పూజారుల సభలో ఆయన మాట్లాడారు. గిరిజన, బహుజన పూజారులను పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. ధూపదీప నైవేద్యాలకు గిరిజన పూజారికి నెల రూ.10 వేలు ఇవ్వాలని, ఏడాదికి ఒకసారి జరిగే గిరిజన జాతరకు రూ.3 లక్షలు ఇవ్వాలని ప్రభుత్వాలను కోరారు. గ్రామ దేవతలకు ఆలయాల నిర్మాణంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై తెలంగాణలోని ఐదు జిల్లాల గిరిజనులతో కలిసి ఇటీవల రాష్ట్రపతికి వినతిపత్రం అందించామన్నారు. రాష్ట్రపతి ఆదేశాలు ఇచ్చినప్పటికీ దేవాదాయ శాఖ స్పందించడం లేదన్నారు. మహారాష్ట్ర ఉపాధ్యక్షులు లక్ష్మీ ఠాకూర్, బీజేపీ ఉత్తర భారతదేశ ఉపాధ్యక్షులు వీరేందర్ దీర్దాస్ శర్మాజీ, రాజస్థాన్ రాష్ట్ర అధ్యక్షుడు నితీష్ చౌదరీజీ, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్‌ఖేతన్, కార్యనిర్వాహక అధ్యక్షుడు వైభవ సూర్యాజీ, జాతీయ ప్రధాన కార్యదర్శి కుశాల్ పలివాలిజీ, కర్నాటక మహామంత్రి మహావీర్ కొరవిజీ, విశ్వహిందూ మహాసంఘ్ తెలంగాణ కోఆర్డినేటర్ మద్దిశెట్టి సామేలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సెక్యూరిటీ సిబ్బందికి ముగిసిన శిక్షణ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో సెక్యూరిటీ సిబ్బందికి కొత్తగూడెంలో ఇస్తున్న శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో కార్పొరేట్ సెక్యూరిటీ జనరల్ మేనేజర్ సీహెచ్.లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. శిక్షణలో నేర్చుకున్న అంశాల్లో విధుల్లో అమలుచేస్తూ సంస్థ ఆస్తులను పరిరక్షించాలని సూచించారు. అలాగే, శిక్షణను నిర్లక్ష్యం చేయొద్దని, వృత్తి నైపుణ్యాలను పెంపొందించడానికి దోహదపడుతుందని గుర్తించాలన్నారు. ట్రైనింగ్ ఆఫీసర్ జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ రెండు వారాల పాటు శిక్షణలో నిపుణులతో పలు అంశాలపై అవగాహన కల్పించామని, విధుల్లో ఆధునిక పరిజ్ఞానం ఆవశ్యకతను వివరించామని తెలిపారు.

పురాతన రాతి కట్టడాల సందర్శన

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): పెనుబల్లి మండలంలోని నీలాద్రీశ్వర ఆలయానికి సమీపాన చారిత్రక రాతి కట్టడాలను అన్నపురెడ్డిపల్లి మండలం ఎర్రగుంట పాఠశాలకు చెందిన విద్యార్థులు శనివారం సందర్శించారు. 1,200 ఏళ్ల క్రితం నాటివిగా భావించే ఈ కట్టడాల వద్ద ఆదిమానవులు సంచరించిన ఆనవాళ్లను గతంలో గుర్తించారు. ఈసందర్భంగా కట్టడాలు, రాళ్లపై చిత్రాలను పరిశీలించిన విద్యార్థులు కాకతీయుల కాలం నాటి శివాలయాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఉండేటి ఆనంద్‌కుమార్, హెచ్ఎం శంకర్‌మహాదేవన్, ఉపాధ్యాయులు బాబురావు, వెంకటేశ్వరరావు, సునందారెడ్డి, మోతీలాల్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని మహిళకు గాయాలు

కొత్తగూడెంఅర్బన్: రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ తీవ్రంగా గాయపడ్డ సంఘటన శనివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం .. పాతకొత్తగూడేనికి చెందిన భవాని బీటీపీఎస్ ఉద్యోగిగా పని చేస్తోంది. విధులు ముగించుకుని వచ్చిన ఆమె శనివారం తెల్లవారుజామున కొత్తగూడెం రైల్వే స్టేషన్ దగ్గర రోడ్డు దాటుతోంది. ఈ క్రమంలో వేగంగా వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొట్టింది. దీంతో భవాని రెండు కాళ్లు విరిగిపోయాయి. ఘటన జరిగినప్పుడు అక్కడే ఉన్న త్రీటౌన్ ఎస్సై మస్తాన్, స్థానికులు కలిసి స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తీసుకెళ్లారు. కాగా ద్విచక్ర వాహనదారుడు ఆగకుండా వెళ్లిపోయాడు.

అవగాహనతోనే ఎయిడ్స్ కట్టడి

- ప్రభుత్వాస్పత్రుల్లో విస్తృతంగా హెచ్ఐవీ పరీక్షలు
- జిల్లాలో 2,998 కేసులు నమోదు
- నేడు ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం

భద్రాచలంఅర్బన్: ప్రాణాంతకవ్యాధిగా ప్రజలను భయాందోళనకు గురిచేసిన ఎయిడ్స్‌ను ఇప్పుడు సాధారణ వ్యాధిగా పరిగణిస్తున్నారు. శాస్త్రజ్ఞుల పరిశోధనలు, ప్రభుత్వాల పట్టుదలతో క్రమంగా హెచ్ఐవీ కనుమరగయ్యే సూచనలు కనిపిస్తున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం వ్యాధిని పూర్తిగా నిర్మూలించలేకపోయినా దాన్ని కట్టడి చేసే ప్రయత్నం చేస్తున్నారు. అయితే ప్రజల్లో అవగాహనలేమితో హెచ్ఐవీ కేసుల సంఖ్య ఏటా పెరుగుతున్నాయి. జిల్లాలో ప్రస్తుతం 2,998 కేసులు ఉన్నాయి. గతేడాది 318 నమోదు కాగా, ఈ ఏడాది ఇప్పటివరకు 373 కేసులు నమోదయ్యాయి.

ఏఆర్టీ సెంటర్‌దే కీలకపాత్ర

హెచ్ఐవీ నిర్ధారణ, చికిత్సలో ఏఆర్టీ కేంద్రం కీలక పాత్ర పోషిస్తోంది. పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలలో హెచ్ఐవీ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. అక్కడ పాజిటివ్ వచ్చిన కేసులను ఇంటిగ్రేటెడ్ కౌన్సెలింగ్ అండ్ టెస్టింగ్ సెంటర్ (ఐసీటీసీ)లకు పంపిస్తారు. జిల్లాలో భద్రాచలం, పాల్వంచ, మణుగూరు, కొత్తగూడెం, ఇల్లెందు, అశ్వారావుపేటలలో ఆరు ఐసీటీసీలు ఉన్నాయి. అక్కడ పరీక్షించాకే వ్యాధి నిర్ధారణ జరుగుతుంది. అనంతరం ఏఆర్టీ సెంటర్ పంపించి ఖరీదైన యాంటీ రిట్రో వైరల్ థెరపీ ఔషధాలను ఉచితంగా ఇస్తున్నారు. జిల్లాలో ఒక్క భద్రాచలంలో మాత్రమే ఏఆర్టీ కేంద్రం ఉంది. వ్యాధి అడ్వాన్స్ స్టేజ్ మందులు కూడా ఏఆర్టీ సెంటర్‌లో అందిస్తారు. కాగా జిల్లాలో 1,206 మంది ఎయిడ్స్ బాధితులకు రూ.2016 చొప్పున ప్రభుత్వం



భద్రాచలం ఏరియా ఆస్పత్రి ఆవరణలోని ఏఆర్టీ సెంటర్

పింఛన్ ఇస్తోంది. మందులు వాడుతున్న ప్రతి ఒక్కరికీ ప్రతి నెలా బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది.

ప్రజలు ప్రధానపాత్ర పోషించాలి..

ఎయిడ్స్ నిర్మూలనకు ప్రభుత్వం ఎన్జీఓలతో కలిసి అనేక కార్యక్రమాలు చేపట్టింది. ప్రస్తుతం టేక్ ద రైట్స్ పాత్ పేరుతో ప్రజలే ప్రధాన పాత్ర పోషించాలనే నినాదంతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఒకరి నుంచి మరొకరికి ఇన్‌ఫెక్షన్లు సోకకుండా ఆపడం, హెచ్ఐవీ మరణాలు తగ్గించడం, వైరస్‌తో జీవిస్తున్న వారిపై సాంఘికంగా, ఆర్థికంగా ప్రభావం లేకుండా చూడటం ప్రధాన లక్ష్యాలుగా నిర్దేశించినట్లు అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో హెచ్ఐవీ బాధితుల వివరాలు

సంవత్సరం	బాధిత గర్భిణులు	ఇతర బాధితులు
2016-17	5	216
2017-18	28	523
2018-19	23	387
2019-20	14	221
2020-21	19	249
2021-22	13	249
2022-23	11	318
2023-24	15	373

తల్లి నుంచి బిడ్డకు రాకుండా..

తల్లి నుంచి బిడ్డకు హెచ్ఐవీ సోకకుండా వైద్యులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం హెచ్ఐవీ ఉన్న గర్భిణులకు ప్రివే స్టన్ ఆఫ్ పేరెంట్ టు వైల్డ్ ట్రాన్స్‌విషన్ (పీపీటీసీటీ) కేంద్రాల్లో కాన్పులు చేస్తున్నారు. వెంటనే పసిబిడ్డకు నివిరాపిన్ టానిక్ ఇచ్చి తల్లి నుంచి బిడ్డకు హెచ్ఐవీ సోకకుండా నివారిస్తున్నారు. గత రెండేళ్లలో 80 శాతం విజయం సాధించారు. ఇక హెచ్ఐవీతో జీవిస్తున్న వారు కూడా సంతానం పొందవచ్చు. పీపీటీసీటీ కేంద్రాలు పాల్వంచ, మణుగూరు, భద్రాచలం, కొత్తగూడెంలలో ఉన్నాయి. అపోహలు తొలగించుకుని, అవగాహన పెంచుకుంటే ఎయిడ్స్ నిర్మూలించవచ్చని పలువురు పేర్కొంటున్నారు.

క్రమం తప్పకుండా మందులు వాడాలి



హెచ్ఐవీ సాధారణ వ్యాధి మాత్రమే. వైద్యులు సూచించినట్లు క్రమం తప్పకుండా మందులు వాడాలి. వ్యాయామం చేయాలి. దురలవాట్లకు దూరంగా ఉంటూ పోషకాహారం తీసుకోవాలి. సానుకూల దృక్పథంతో జీవించడం వల్ల వైరస్ ప్రభావం తగ్గుతుంది. మందులు కూడా ప్రభావవంతంగా పనిచేస్తాయి. – డాక్టర్ సాయికిరణ్, ఏఆర్టీ సెంటర్ మెడికల్ ఆఫీసర్

జీరో దందాకు చెక్!

- లైసెన్స్‌లేని వ్యాపారులకు నోటీసులు జారీ
- ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ అధికారుల చర్యలు

ఇల్లెందు: అనేక ఏళ్లుగా కొందరు రైతులను, ప్రభుత్వాన్ని మోసం చేస్తూ జీరో వ్యాపారం సాగిస్తున్నారు. వారిపై మార్కెట్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే శనివారం ఇల్లెందు మార్కెట్ పరిధిలోని కారేపల్లి, విశ్వనాథపల్లిలో అక్రమ వ్యాపారం చేసే వారి కాంటాలను మార్కెట్ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, సిబ్బంది లక్ష్మయ్య, మధు, హరికృష్ణ, మోహన్‌రావు, రంజిత్, చందర్, రమేష్‌లతో వెళ్లి సీజ్ చేశారు. ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో 8 మండలాలు ఉన్నాయి. రాష్ట్రంలో ఎక్కువ మండలాలు కలిగిన మార్కెట్లలో ఇది ఒకటి. అనుబంధంగా ఆయా మండలాల్లో సబ్ మార్కెట్ యార్డులు కూడా ఉన్నాయి. అయినా వ్యాపారం మాత్రం సాగటం లేదు. మార్కెట్ పరిధిలో కేవలం 55 మంది అనుమతి కలిగిన లైసెన్సు వ్యాపారులు ఉన్నారు. ఇక వందల సంఖ్యలో జీరో వ్యాపారం సాగించే వారే ఉన్నారు. మూడేళ్ల క్రితం 150 మంది వరకు లైసెన్సు పొందిన వారు ఉండగా, వారు మళ్లీ రెన్యూవల్ చేయించుకోలేదు. కొత్త లైసెన్సులు పొందిన వారు జీఎస్టీ చెల్లించడంలేదు. క్రయ విక్రయాల రిజిస్టర్‌లో వివరాలు నమోదు చేయలేదు. ఇలా నిబంధనలను పాటించని వ్యాపారులను గుర్తించి, ఇప్పటికే 50 మందికి నోటీసులు కూడా జారీ చేశారు. కాగా ప్రస్తుతం మరో 20 మంది దరఖాస్తు చేసుకుని లైసెన్సు పొందేందుకు రెడీగా ఉన్నారు.

లక్ష్యం రూ.4.64 కోట్లు

ఇల్లెందు మార్కెట్ కమిటీకి 2025–25 సంవత్సరంలో ఆదాయ లక్ష్యం రూ. 4.64 కోట్లు కాగా నవంబర్ వరకు రూ. 2.50 కోట్లు సమకూరింది. ఇక రానున్న నాలుగు నెలల్లో రూ. 2.14 కోట్లు వస్తే లక్ష్యం చేరుకుంటారు. ప్రస్తుతం ఉన్న ఐదు చెక్


కాంటాలను సీజ్ చేస్తున్న మార్కెట్ ఉద్యోగులు

పోస్టులతోపాటు వ్యాపారులందరూ లైసెన్సు తీసుకుంటే క్రయవిక్రయాల ద్వారా ఆదాయ లక్ష్యం సాధించవచ్చని అధికారులు భావిస్తున్నారు.

సీసీఐ ద్వారా పత్తి విక్రయాలు

మార్కెట్ పరిధిలోని కారేపల్లి జిన్నింగ్ మిల్‌లో సీసీఐ ద్వారా పత్తి కొంటుండగా, సుమారు 660 మంది రైతులు 18,484 టన్నుల పత్తి విక్రయించారు. గత నెల 19 నాటికి విక్రయించిన రైతులకు రూ.13.57 కోట్లు నిధుల చెల్లింపు కూడా జరిగింది.

లైసెన్సు ద్వారా వ్యాపారం చేయండి



గ్రామాల్లో వ్యాపారులందరూ లైసెన్స్ తీసుకుని వ్యాపారం చేయాలి. అనుమతి లేని వ్యాపారుల కాంటాలు సీజ్ చేస్తాం. ప్రతీ మండలంలో నూతన పాలక వర్గం ఆధ్వర్యంలో సభలు సమావేశాలు నిర్వహిస్తున్నాం. లైసెన్సులు పొంది క్రయ విక్రయాల రిజిస్టర్లలో వివరాలు పొందుపర్చి మార్కెట్ ఫీజు చెల్లిస్తే బేఫికర్‌గా వ్యాపారం చేసుకోవచ్చు. జీరో వ్యాపారం చేస్తే చర్యలు తప్పవు. –ఇ.నరేష్, మార్కెట్ కార్యదర్శి ఇల్లెందు

మున్సిపాలిటీ రద్దుపై సమాలోచన

- ఎమ్మెల్యే పాయం అధ్యక్షతన అఖిలపక్ష నాయకుల భేటీ
- సమావేశంలో మణుగూరు అభివృద్ధి దిశగా తీర్మానం

మణుగూరు టౌన్: కొన్నేళ్లుగా మున్సిపాలిటీగా ఉన్న మణుగూరు పట్టణంలో ఎన్నికలు జరగడంలేదు. ఫలితంగా పాలకవర్గం లేక నిధులు రావడం లేదు. వెరసి పట్టణం అభివృద్ధికి నోచుకోవడంలేదు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఇల్లెందు అతిథి గృహంలో శనివారం అన్ని పార్టీల నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అఖిలపక్షం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మణుగూరు పూర్తిస్థాయిలో మున్సిపాలిటీగా కొనసాగకపోడంతోపాటు పంచాయతీలుగా వర్గీకరణ లేక


అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

పోవడంతో అభివృద్ధి జరగడంలేదనే అభిప్రాయం వ్యక్తమైంది. ఉపాధి హామీ పథకం వర్తించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే చర్చ కూడా సాగింది. ఈ క్రమంలో అన్నారం, రాయిగూడెం, చినరావిగూడెం, కమలాపురం, శివలింగాపురం, బాపనకుంట, విఠల్‌రావునగర్, కొత్త కొండాపురం వంటి గ్రామాలను మున్సిపాలిటీ నుంచి తొలగించి గ్రామ పంచాయతీలుగా మార్చాలని తీర్మానించారు. మున్సిపాలిటీని పూర్తిగా రద్దు చేసి పంచాయతీలుగా మార్చాలని, లేనిపక్షంలో సమితిసింగారం గ్రామ పంచాయతీలోని కొంతభాగాన్ని మున్సిపాలిటీలో విలీనం చేయాలని తీర్మానిస్తూ అఖిలపక్ష నాయకులు సంతకాలు చేశారు. ఈ సమావేశంలో సీపీఐ నుంచి అయోధ్య, సరెడ్డి పుల్లారెడ్డి, టీడీపీ నుంచి వాసిరెడ్డి చలపతిరావు, వట్టం నారాయణ, బీజేపీ నుంచి భిక్షపతి, లింగంపల్లి రమేష్, సీపీఎం నుంచి నెల్లూరు నాగేశ్వరరావు, ఉప్పుతల నర్సింహారావు, సీపీఐ (ఎంఎల్) మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి పీరినాకి నవీన్, కాటబోయిన నాగేశ్వరరావు, సామా శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టణవాసుల్లో హర్షాతిరేకాలు

మున్సిపాలిటీ రద్దుపై అఖిలపక్ష నాయకులు సమాలోచనలు చేయడంతో పట్టణవాసుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఇంటిపేర్లు మార్పు, 100 రోజుల పనిదినాలు, నిధుల లేమి వంటి సమస్యలు తొలగిపోతాయని పేర్కొంటున్నారు. మణుగూరు అభివృద్ధికి మున్సిపాలిటీ రద్దుపై సమాలోచనకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయడం, తీర్మానాలకు అన్ని పార్టీలు ఆమోదం తెలపడంతో పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

‘ఒకే దేశం.. ఒకే విద్య’ కావాలి

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు వెంకట్

జూలూరుపాడు: ఒకే దేశం.. ఒకే ఎన్నిక కాదు, ఒకే దేశం.. ఒకే విద్య కావాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు బి.వెంకట్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఏవీఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన సీపీఎం మండల మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని విమర్శించారు. బీజేపీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చలేదన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో విఫలమైందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగానే పని చేస్తోందన్నారు. అనంతరం ఆ పార్టీ నూతన మండల కమిటీ ఎన్నిక జరిగింది. సీపీఎం మండల కార్యదర్శిగా యాసా నరేష్ తిరిగి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, నాయకులు మచ్చా వెంకటేశ్వర్లు, రేపాకుల శ్రీనివాసరావు, భూక్యా రమేష్, మండల కార్యదర్శి యాసా నరేష్, బానోత్ ఇస్రా, పద్దం సుగుణ, గార్లపాటి వెంకటి, బానోత్ మధు, గడిదేశి కనకరత్నం, లకావత్ శ్రీను, జల్లి రాధాకృష్ణ, ఊడల వెంకటేశ్వర్లు, మాళోత్ రాములు, వల్లమల్ల చందర్‌రావు, తాటి పద్మ, రెడ్డిబోయిన గోవిందు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు వెంకట్

నాణ్యమైన సరుకులే సరఫరా చేయాలి

- అలసత్వం వహిస్తే ఉద్యోగులపై చర్యలు
- గిరిజన సహకార సంస్థ జీఎం సీతారాంనాయక్

భద్రాచలం: గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకుల పాఠశాల, కళాశాలలకు జీసీసీ ద్వారా నాణ్యమైన నిత్యావసర సరుకులు సరఫరా చేయాలని, ఈ విషయంలో గోదాంల సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని రాష్ట్ర గిరిజన సహకార సంస్థ జీఎం సీతారాంనాయక్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలోని గిరిజన సహకార సంస్థ సొసైటీల ఉద్యోగులతో ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా జీఎం మాట్లాడుతూ రాష్ట్రంలో పలు పాఠశాలల్లో జరిగిన ఘటనల దృష్ట్యా ఏ లోపం ఎదురైనా సరుకుల్లో నాణ్యత లోపించిందని భావిస్తారన్నారు. అలా జరగకుండా జీసీసీ ఉద్యోగులు నాణ్యమైన సరుకులు పంపిణీ చేస్తూ హెచ్ఎంలు, వార్డెన్ల నుంచి నిరభ్యంతర పత్రాలు తీసుకోవాలని సూచించారు. అలాగే, సన్నబియ్యం మాత్రమే సరఫరా చేయాలని, ఎక్కడైనా ఫిర్యాదులు అందితే ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామని జీఎం హెచ్చరించారు. తొలుత ఆయన భద్రాచలంలోని గురుకుల పాఠశాలలో సామగ్రిని గురుకులాల ఆర్‌సీఓ నాగార్జునరావుతో కలిసి పరిశీలించారు. ఈ సమావేశంలో జీసీసీ డీఎం సమ్మయ్య, మేనేజర్లు లక్కోజీ, నర్సింహారావు, జయరాజ్, పాపారావు, లక్ష్మణరావు, దీప్‌లాల్, భూషయ్య తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జీఎం సీతారాంనాయక్

దీపావళి బోనస్ ఎప్పుడిస్తారో..?

ఎదురుచూస్తున్న 2,754 మంది సింగరేణి రిటైర్డ్ కార్మికులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ 1 నుంచి అక్టోబర్ 24 వరకు ఉద్యోగ విరమణ పొందిన కార్మికులకు దీపావళి బోనస్ ఇస్తామని యాజమాన్యం పేర్కొంది. సుమారు 2,754 మంది కార్మికులకు రూ.18.27 కోట్లను నవంబర్ 27న చెల్లిస్తామని అదే నెల 23న ప్రకటించింది. ఆదేశాలు కూడా జారీ చేసింది. దీంతో ఒక్కొక్కరికి రూ. 93,750 అందుతాయని కార్మికుల ఆనందపడ్డారు. కానీ యాజమాన్యం ప్రకటించిన గడువు దాటి నాలుగు రోజులైనా నగదు కార్మికుల అకౌంట్లలో జమ కాలేదు. దీనిపై సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ ఆర్థిక శాఖకు ఆదేశాలు జారీ చేసినా, ఆ శాఖ అధికారులు బోనస్ చెల్లించకపోవడం సరికాదని కార్మికులు పేర్కొంటున్నారు.

మొబైల్ యూనిట్ వైద్యసిబ్బంది నియామకం

కొత్తగూడెంరూరల్: మొబైల్ యూనిట్ వైద్యసిబ్బందికి శనివారం నియామక పత్రాలు అందజేశారు. ప్రధాన మంత్రి జన్‌జాతి ఆదివాసీ న్యాయ మహాఅభియాన్ కార్యక్రమంలో భాగంగా అశ్వారావుపేట మొబైల్ యూనిట్‌లో విధులు నిర్వహించేందుకు జిల్లా సెలక్షన్ కమిటీ ద్వారా మెడికల్ ఆఫీసర్, పారామెడికల్ అసిస్టెంట్‌ను ఎంపిక చేశారు. వారికి డీఎంహెచ్ఓ భాస్కర్‌నాయక్ నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు బి.బాలాజీ, కె.సుదర్శన్, రత్నరాజు, ప్రమీల, దీపిక తదితరులు పాల్గొన్నారు.


మొబైల్ యూనిట్ సిబ్బందికి నియామక పత్రం అందజేస్తున్న డీఎంహెచ్ఓ భాస్కర్‌నాయక్

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

చర్ల: డిసెంబర్ 2 నుంచి 8 వరకు పీఎల్‌జీఏ వార్షికోత్సవాలు నిర్వహించాలంటూ మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. చర్ల మండలానికి సమీపంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ఉండటం, వారోత్సవాల నేపథ్యంలో చర్ల మండలం నుంచి, చర్ల మండలం మీదుగా ఎవరైనా వారోత్సవాలకు వెళ్లవచ్చనే అనుమానంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. చర్ల సీఐ ఏ.రాజువర్మ నేతృత్వంలో సివిల్, స్పెషల్ పార్టీ, సీఆర్‌పీఎఫ్ పోలీసులు ముమ్మరంగా సోదాలు నిర్వహిస్తున్నారు. చర్ల మండలం మీదుగా సరిహద్దు ప్రాంతానికి వెళ్లే ప్రధాన రహదారులైన లెనిన్‌కాలనీ, తాలిపేరు ప్రాజెక్టు, కలివేరు క్రాస్‌రోడ్, దానవాయిపేట తదితర ప్రాంతాల్లో పోలీసు బలగాలను మోహరించారు. అటవీ ప్రాంతాలకు వెళ్లి వస్తున్న వారి వివరాలను తెలుసుకుంటున్నారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నించి, నిర్ధారించుకున్నాక విడిచిపెడుతున్నారు.

దొరికిన దొంగలు

దుమ్ముగూడెం : మండలంలోని రేగుబల్లి ఇసుక ర్యాంపులో ఉన్న జేసీబీ మిషన్ల బ్యాటరీలను చోరీ చేస్తున్న మహిళలను గ్రామస్తులు పట్టుకున్నారు. ఇసుక ర్యాంపు వద్ద కొంతకాలంగా మిషన్ల బ్యాటరీలు చోరీకి గురవుతున్నాయి. శనివారం నలుగురు మహిళలు ఐదు బ్యాటరీలను చోరీ చేసి బస్తాల్లో తరలిస్తుండగా గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

ములకలపల్లి: అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీసులు శనివారం సీజ్ చేశారు. ఎస్సై కిన్నెర రాజశేఖర్ కథనం ప్రకారం.. ములకలపల్లి శివారులోని వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో దాడులు నిర్వహించారు. అనుమతిపత్రాలు లేకుండా ఇసుక తోలుతున్న మూడు ట్రాక్టర్లను సీజ్‌చేసి, తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు.

పాల్వంచలో రెండు..

పాల్వంచ/పాల్వంచరూరల్: ములకలపల్లి మండలం గుర్రాలకుంట గ్రామ సమీపంలోని మొర్రేడు వాగునుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శనివారం పట్టుకున్నట్లు తహశీల్దార్ వివేక్ తెలిపారు. ఆర్ఐ రవికుమార్‌రెడ్డి మండల సరిహద్దులో నిఘావేసి పట్టుకుని కార్యాలయానికి తరలించి, సీజ్ చేశారని పేర్కొన్నారు.

విద్యుత్ తీగలు తెగిపడి..

మహిళకు గాయాలు

ములకలపల్లి: విద్యుత్ తీగలు తెగి పడి శనివారం ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. ములకలపల్లికి చెందిన నరాటి వెంకటలక్ష్మి కిరాణా దుకాణానికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తోంది. ఈ క్రమంలో ఇంటి ఎదుట ఉన్న సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా చేసే వ్యవసాయ లైన్ వైరు తెగి ఆమెపై పడింది. దీంతో విద్యుదాఘాతానికి గురికాగా, స్థానికులు తాళ్లు, కర్రలసాయంతో క్షతగాత్రురాలిని కాపాడారు. మెడ, చేతులకు తీవ్ర గాయాలు కావడంతో మంగపేట ఆస్పత్రికి తరలించి, చికిత్స అందించారు. కాగా సమీపంలోని చెట్టు కొమ్మలు తరచూ విద్యుత్ లైనుకు తాకడం వల్లే తీగ తెగిపోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని అన్నారు. ఈ విషయమై ట్రాన్స్ కో ఏఈ నరేశ్‌ను వివరణ కోరగా... గతంలో చెట్టు కొమ్మలు కొట్టేందుకు ప్రయత్నించగా, నీడ నిమిత్తం స్థానికులు అడ్డుకున్నారని తెలిపారు. వెంటనే కొమ్మలు తొలగిస్తామని పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యాచకురాలి మృతి

పాల్వంచ: ఆర్టీసీ బస్టాండ్ వద్ద శనివారం బస్సు ఢీ కొని ఓ యాచకురాలు అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. బస్టాండ్ నుంచి బయటకు వస్తున్న క్రమంలో బస్సు యాచకురాలు ధారావత్ తాధి(87)ను ఢీ కొట్టింది. ఆమెపై నుంచి బస్సు చక్రాలు వెళ్లడంతో శరీర భాగాలు నుజ్జునుజ్జయ్యాయి. కాగా మంచికంటినగర్‌కు చెందిన, మృతురాలి కూతురు బానోతు గంగ ఫిర్యాదు మేరకు మణుగూరుకు చెందిన బస్సు డ్రైవర్ తెంబరేణి నాగ వరప్రసాద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు.